వర్షం కురిస్తే... రోడ్లపైకి మురుగు

- జీవీఎంసీ 16వ వార్డు రజకవీధిలో అధ్వానంగా కాలువలు
- పైపులు మూసుకుపోవడంతో రోడ్డుపైకి చెత్త, వ్యర్థాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



కాలువలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు



రోడ్డుపైకి చేరిన మురుగునీరు, చెత్త



ఇటీవల వర్షానికి రోడ్డుపై చేరిన బురద, వ్యర్థాలు



రజక వీధిలోని ప్రధాన కాలువలో పూడిక

మద్దిలపాలెం:

జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారుల అనాలోచిత నిర్ణయాలు, నిర్మాణాలకుతోడు ఆక్రమణలతో చినుకు పడితే చాలు వీధులన్నీ మురుగునీటి ముంపునకు గురవుతున్నాయి. ఎక్కడైనా ప్రధాన కాలువల మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా కాలువల నిర్మాణం చేపట్టాలి. అలా కాకుండా ఇష్టానుసారంగా కాలువలు నిర్మించేయడంతో వర్షం కురిసినప్పుడల్లా మురుగునీరు పొంగి ప్రవహిస్తోంది. ఇదీ జీవీఎంసీ 16వ వార్డు పరిధి రజకవీధిలో దుస్థితి. ఈ వార్డులో రజకవీధి మురుగునీటి కాలువ సామాజిక భవనం వెనుక నుంచి ప్రవహిస్తుంది. ఈ మురుగు ఇసుకతోట వైపు వెళ్లే గెడ్డలో కలిసేందుకు వీలుగా అనుసంధానించారు. అయితే ఆ సమయంలో కాలువ నిర్మించకుండా పైపులు వేసి... పైన పూర్తిగా కప్పేశారు. దీంతో పైపుల్లోని చెత్త, వ్యర్థాలు తీయడానికి వేలులేకపోవడంతో పూడిక పేరుకుపోయింది. మరోవైపు కాలువకు ఒకవైపు భారీ భవంతులు... మరోవైపు రజకవీధి సామాజిక భవనం నిర్మించారు. వీటికి తోడు కాలువ పైభాగాన్ని ఆక్రమించి బడ్డీలు, ఇతర నిర్మాణాలు చేపట్టారు. దీంతో మొత్తంగా ఈ కాలువలో పూడికలు తీయడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా దుర్వాసనతో స్థానిక నివాసులు నరకయాతన అనుభవిస్తున్నారు.

మూసుకుపోయిన కాలువ గొట్టాలు

రజకవీధి కాలువ నుంచి నేరుగా గెడ్డకి అనుసంధానం చేస్తూ భూగర్భ డ్రైనేజీలో భాగంగా పైపులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పైపుల్లో చెత్త పేరుకుపోవడంతో పూర్తిగా మూసుకుపోయాయి. మురుగునీటి ప్రవాహానికి దారిలేక, కాలువ నిత్యం మురుగునీటితో నిండిపోతోంది. చిన్న పాటి వర్షం కురిసినా కాలువలోని నీరు పొంగి ప్రవహిస్తోంది. ఫలితంగా రజకవీధి వెనుక భాగంలో గల రహదారి మురుగు, చెత్తతో నిండిపోతోంది. మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఈ ప్రాంతమంతా మురుగునీటితో నిండిపోయింది. ఆ మార్గంలో వెళ్లాలంటే ముక్కుమూసుకోవాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు, బురద రోడ్లపైకి చేరడంతో రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. పారిశుధ్య సిబ్బంది తాత్కాలికంగా చెత్త, బురద తొలగించారు.

జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

జీవీఎంసీ 16వ వార్డులో ఇటీవల పర్యటించిన కమిషనర్ పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో శానిటరీ సెక్రటరీకి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అయినప్పటికీ వార్డులో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బంది తీరులో మార్పు రాలేదు. కమిషనరే వార్డులో కాలువలు, గెడ్డల పరిస్థితి పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేసినా... సిబ్బంది చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. మూడు రోజుల క్రితం కురిసిన ఆకస్మిక భారీ వర్షానికి రజకవీధి కాలువ పొంగి ప్రవహించింది. కాలువలో పేరుకుపోయిన చెత్త మొత్తం రోడ్లపై చేరింది. పాదచారులు సైతం నడవడానికి వీలు లేనంతగా దారుణ పరిస్థితి నెలకుంది. వార్డు శానిటరీ సిబ్బంది మరుసటిరోజు రోడ్డుపై చెత్త తొలగించడానికి నానా హైరానా పడ్డారు. ఇప్పటికీ చెత్త ఎక్కడికక్కడ దర్శనమివ్వడమే కాకుండా, కాలువలో పేరుకుపోయిన పూడికలు అలానే ఉన్నాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలువ గొట్టాలు తొలగించేస్తేనే...

మురుగునీటి కాలువను గెడ్డకు అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన గొట్టాలకు మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఆ గొట్టాలను పూర్తిగా తొలగించి కాలువ నీటి ప్రవాహానానికి పక్కాగా డ్రైనేజీ నిర్మించాలని సూచిస్తున్నారు. చిన్నపాటి వర్షానికే మురుగునీటితో సహవాసం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

ముందస్తు పరీక్షలతో రొమ్ము క్యాన్సర్ నియంత్రణ



రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కూపన్ ఆవిష్కరిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి

ఆరిలోవ : రొమ్ము క్యాన్సర్‌కు ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరమని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి సూచించారు. బ్రెస్ట్ క్యాన్సర్ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం హెల్త్ సిటీ మెడికవర్ ఆస్పత్రిలో రొమ్ము క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికవర్ యాజమాన్యం అందుబాటులోకి తీసుకొచ్చిన ఉచిత స్క్రీనింగ్ పరీక్షల కూపన్‌ను వైద్యులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. నెల రోజులపాటు మహిళలకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు క్యాన్సర్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి ఎదుర్కోవాలన్నారు. లేదంటే ప్రాణాలకు ప్రమాదమని ఆమె హెచ్చరించారు. చీఫ్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రమావత్ దేవ్ మాట్లాడుతూ క్యాన్సర్ నియంత్రణకు అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో అంకాలజిస్టులు డాక్టర్ సాహిత్య, డాక్టర్ కార్తీక్ చంద్ర, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ రమేష్, డాక్టర్ అభిలాష్, సెంటర్ హెడ్ డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

వైద్యశాల మరమ్మతుల పరిశీలన

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం హోమియో వైద్యశాలలో అవసరమైన మరమ్మతులను ఇంజినీరింగ్ విభాగం చేపట్టింది. బుధవారం ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు వైద్యశాల పనుల ప్రగతిని పరిశీలించారు. హోమియో డిస్పెన్సరీలో జరుగుతున్న మరమ్మతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏయూ హోమియో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జి.వి.వి.రామేశ్వర్‌ను ఏయూ వైద్యశాలల (నార్త్, సౌత్ క్యాంపస్) పర్యవేక్షణాధికారిగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు అందించారు.

జీఎస్టీ తగ్గింపుతో ఊరట

ఎంవీపీ కాలనీ: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం నగరంలోని ఓ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ స్లాబ్‌ల తగ్గింపుతో మధ్యతరగతి ప్రజలకు ఊరట లభించిందన్నారు. దీంతో ప్రజలకు మంచి సేవింగ్స్ లభించడంతోపాటు వృద్ధిరేటు పెరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో జీఎస్టీలో మరిన్ని సంస్కరణలు రానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనతో దేశాభివృద్ధి

ఏయూ క్యాంపస్: మహిళల ఆర్థిక స్వావలంబనతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. బుధవారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫిక్కీ ఎఫ్‌ఎల్‌వో) విజయవాడ ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో స్త్రీల భద్రత – మహిళా సాధికారత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఎంతో అవసరమన్నారు. ఇంటిని సమర్థంగా నిర్వహిస్తూ వ్యాపారవేత్తలుగా రాణించడం ఎంతో గర్వకారణమన్నారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన శక్తి యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మహిళలను సత్కరించారు.

ఎంవీపీలో విస్తృతంగా చెట్ల కొమ్మల తొలగింపు



లారీలో తరలిస్తున్న చెట్ల కొమ్మలు

ఎంవీపీ కాలనీ: ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్న చెట్ల కొమ్మలను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఎంవీపీ కాలనీలోని పలు రోడ్లలో బుధవారం ఈ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగింది. ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా సర్కిల్, ఎంవీపీ సర్కిల్ రోడ్లలో కోనోకార్పస్ చెట్ల కొమ్మలు పెద్ద ఎత్తున రోడ్డు అంతటా విస్తరించాయి. దీంతో వాహనదారులతోపాటు పాదచారులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ సిబ్బంది ఆ రోడ్లుతోపాటు ఎంవీపీ కాలనీలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగించి లారీల్లో తరలించారు.

సెయింట్ జోసెఫ్‌లో రచయిత్రుల జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలనతో సదస్సు ప్రారంభిస్తున్న అతిథులు



అతిథులు, అధ్యాపకులతో విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భాషా విభాగాల ఆధ్వర్యంలో 'స్వాతంత్ర్యానంతర తెలుగు–హిందీ సాహిత్యంలో రచయిత్రుల సాహిత్య కృషి' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అధ్యక్షతన బుధవారం జరిగింది. గాంధీ సెంటర్ అధ్యక్షులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రచయిత్రుల కృషి అభినందనీయమన్నారు. గౌరవ అతిథులుగా హాజరైన ఏపీడబ్ల్యుజే అధ్యక్షుడు డాక్టర్ ఎస్. కృష్ణబాబు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు రచయిత్రుల సాహితీ కృషి గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా రైటర్స్–జర్నలిస్ట్స్ అసోసియేషన్ సౌజన్యంతో జరగనున్న రెండు రోజుల సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్, కళాశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి రచించిన కథల సంపుటిని, సెమినార్ గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ జె.నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై సదస్సు

మద్దిలపాలెం: ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన కల్పించారు. వృక్ష శాస్త్ర విభాగం, హరిత కృష్ణ ఎకో క్లబ్, ప్రజా ప్రగతి ట్రస్ట్, ఇండియా పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ ఐ.విజయబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ ఆవశ్యకతను తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, కో ఆర్డినేటర్ కె.రవిబాబు, వృక్ష శాస్త్ర విభాగాధిపతి ఎస్.పద్మావతి, హరిత కృష్ణ ఎకో క్లబ్ కో ఆర్డినేటర్ వి.పద్మజ, ఎ.హెచ్.డి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ నూతన ఏడీఆర్ఎంగా రామారావు



తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ నూతన అడిషనల్ డివిజినల్ రైల్వే మేనేజర్‌గా కుందు రామారావు నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లా, పలాసకు చెందిన ఆయన 2002లో ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసారు. ప్రజాసేవపై గల ఆసక్తితో 2006లో ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష రాసి, ఆలిండియా 44వ ర్యాంకు సాధించి రైల్వేలో చేరారు. పలు జోన్లలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా, సీనియర్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా, సీనియర్ డివిజినల్ ఇంజినీర్‌గా, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా పని చేశారు. జపాన్‌లో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో కూడా ఈయన పాల్గొన్నారు. తన సేవలకు గాను ప్రతిష్టాత్మక జనరల్ మేనేజర్ అవార్డును 2010లో పొందుకున్నారు.

జీవన నైపుణ్యాలతోనే ఉన్నత స్థానం



ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కేవీ రమణ

మురళీనగర్ : పాలిటెక్నిక్ కెమికల్ డిప్లమా విద్యార్థులు సబ్జెక్టులో పట్టు సాధించడంతోపాటు జీవన నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారానే ఉన్నత స్థానానికి చేరుకోగలరని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ తెలిపారు. గైస్ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉన్నత ఫౌండేషన్ నిర్వహించిన నైపుణ్య శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సమాచార నైపుణ్యాలు, ఆంగ్ల భాషలో మాట్లాడడం, జీవన నైపుణ్యాలను పెంచుకోవడం వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. స్వీయ నిర్వహణ, బృంద సభ్యులతో సమన్వయం చేసుకుని పని చేయడం ద్వారా ఉద్యోగాల్లో రాణించగలరని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో పెట్రో కెమికల్స్ హెడ్ సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, సీనియర్ లెక్చరర్లు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

సీతంపేట: స్వర కళానిధి సాంస్కృతిక సంగీత సంస్థ అధ్యక్షుడు రైల్వే ప్రసాద్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. డీసీపీ నాయుడు, జ్యోతిపాడిన చిగురులు వేసిన కలలన్ని, పెమ్మరాజు రామ్, రమణి పాడిన నీ అందానికి బంధం, అమ్మాజీరావు, పావని పాడిన ఇది మేఘ సందేశమో, సురేష్ కన్న పాడిన ఈ జీవన తరంగాలలో గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. వీరికి కీ బోర్డుపై సోమేష్, ప్యాడ్స్‌పై బాబ్జి, తబలాపై రైల్వే ప్రసాద్, అప్పలరాజు వాద్య సహకారం అందించారు. ముందుగా రైల్వే విశ్రాంత అధికారి డీసీపీ నాయుడు, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత విభావరిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ఉల్లాసం కోసం సంగీతం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కొణతాల రాజు, ఫణిస్వామి, మహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

జూలో ముగిసిన వన్యప్రాణి వారోత్సవాలు



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సీఎఫ్ మహ్మద్ దివాన్ మైదీన్

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణి వారోత్సవాలు బుధవారం ముగిశాయి. పిల్లలు పలు రకాల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జూలో వారోత్సవాలు ఈ నెల 2న ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రారంభం నుంచి పాఠశాల, కళాశాలలతోపాటు వివిధ వయసుల వారికి జూ అధికారులు పోటీలు నిర్వహించారు. వన్యప్రాణులు, పర్యావరణం, తదితర అంశాలపై వక్తృత్వం, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ తదితర పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారికి అధికారులు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. సీఎఫ్ మహ్మద్ దివాన్ మైదీన్, సహాయ అటవీ జనరల్ ఇన్‌స్పెక్టర్ కె.బాలాజీ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాటిని సంరక్షించి మానవులు, ప్రకృతి మధ్య సామరస్యాన్ని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో జూ క్యూరేటర్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు, సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

బీచ్‌రోడ్డు : ప్రతీ సంవత్సరం అత్యంత వైభవంగా జరుపుకునే రాధాకృష్ణ మహోత్సవాలు ఈ ఏడాది నవంబర్ 5న నిర్వహించనున్నామని యాదవ సంఘ గౌరవ అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం సంపత్ వినాయక దేవాలయం వద్ద విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి రాధాకృష్ణ మహోత్సవాల (పాలు పెరుగు యదుమేళా) పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్ రోడ్డు గోకుల్ పార్కు వద్ద నిర్వహించే మహోత్సవాలు యాదవ సమాజంలో ఐక్యత, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణ, భక్తి భావాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘ గౌరవ అధ్యక్షుడు బరినకాన రామారావు, విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పల నుంచి దుర్వాసన



పీతలవానిపాలెం గెడ్డలో తొలగించి రోడ్డుపై వేసిన చెత్త

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు పరిధి పీతలవానిపాలెం గెడ్డలో తొలగించిన చెత్త తరలించకపోవడంతో దుర్వాసన భరించలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల క్రితం గెడ్డ నుంచి తొలగించిన చెత్తను రోడ్డు పక్కనే కుప్పలుగా వేసి వదిలేశారు. నేటికీ తొలగించకపోవడంతో దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ చెత్త కుప్పలపై కుక్కలు చేరి చెల్లాచెదురుగా చేయడంతో మార్గమంతా అధ్వానంగా తయారైంది. వీటిని తొలగించాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు కాలనీవాసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయనున్నామని కాలనీవాసులు పేర్కొంటున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే చెత్త తొలగించాలని కోరుతున్నారు.

ఓపెన్ పార్కు..!

రక్షణ గోడ కూలడంతో ముడసర్లోవలోకి సులువుగా ప్రవేశం



ఆరు నెలల క్రితం కూలిపోయిన ముడసర్లోవ పార్కు రక్షణ గోడ

ఆరిలోవ: ముడసర్లోవ పార్కు రక్షణ గోడ కూలిపోయి సుమారు ఆరు నెలలు గడుస్తున్నా అధికారులు పునర్నిర్మించ లేదు. దీంతో ఇది ఓపెన్ పార్కుగా మారిపోయింది. ప్రవేశ ద్వారంతో సంబంధం లేకుండా నేరుగా రక్షణ గోడ కూలిన చోట నుంచి ఎవరైనా లోపలకు సులువుగా ప్రవేశించవచ్చు. ఈ పార్కు కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరిన విషయం తెలిసిందే. సుమారు ఎనిమిదేళ్ల క్రితమే ఈ పార్కు చుట్టూ పలుచోట్ల ప్రహరీ కూలిపోయింది. ఆయా చోట్ల ఎవరూ లోపలకు ప్రవేశించకుండా కర్రలతో సిబ్బంది కంచె ఏర్పాటు చేశారు. సుమారు ఆరు నెలల క్రితం పార్కుకి చెందిన క్యాంటీన్ పక్కన సుమారు 20 మీటర్లకు పైగా రక్షణ గోడ భాగం కూలిపోయింది. దీంతో ప్రస్తుతం ఈ పార్కు లోపల భాగం బయట రోడ్డు మీద నుంచి కనిపిస్తుంది. దీని లోపలకు ప్రవేశించడానికి ముఖద్వారంతో పనిలేకుండా ఏ మూల నుంచైనా వెళ్లడానికి వీలుగా మారింది. ఈ పార్కును అభివృద్ధి చేయడానికి అధికారులు అదుగో ఇదుగో అంటూ మాయమాటలు చెబుతూ కాలం గడుపుకొస్తున్నారు తప్ప కార్యాచరణ చేపట్టడం లేదు. ఇప్పుడు అత్యవసరమైన రక్షణ గోడ కూడా నిర్మించకుండా వదిలేశారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆన్ సోషల్ ఇంక్లూషన్ (సీఎస్ఎస్ఐ) ఆధ్వర్యంలో 2026 ఫిబ్రవరి 3, 4న నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆచార్యులు, పరిశోధకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థల నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడానికి, వివిధ అంశాలపై వారి ఆలోచనలు పంచుకోవడానికి ఈ సెమినార్ దోహదపడుతుందని వీసీ అన్నారు. అనంతరం 'పబ్లిక్ పాలసీ అండ్ సోషల్ ఇంక్లూసివ్‌నెస్ – యాన్ ఇండియన్ పర్స్పెక్టివ్ ఫర్ ది 21వ సెంచరీ' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

విశాఖ రైల్వేస్టేషన్‌లో అమృత్ సంవాద్



ఉత్తమ సూచన ఇచ్చిన ప్రయాణికురాలికి కానుక అందజేస్తున్న రైల్వే అధికారి పవన్‌కుమార్

తాటిచెట్లపాలెం: ప్రత్యేక క్యాంపెయిన్–5లో భాగంగా ప్రయాణికుల భాగస్వామ్యంతో కూడిన అమృత్ సంవాద్ కార్యక్రమాన్ని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం నిర్వహించారు. జనరల్ స్లీపర్ క్లాస్ వెయిటింగ్ హాళ్ల వద్ద వాల్తేర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ కె. పవన్‌కుమార్ ప్రయాణికులతో ముచ్చటించారు. వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. రైల్వే అధికారులు, ప్రయాణికుల ప్రత్యక్ష సమాచార ప్రక్రియలో భాగమే అమృత్‌సంవాద్. అక్టోబరు 31వ తేదీ వరకు జరిగే ఈ ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా రైల్వే అధికారులు స్వయంగా ప్రయాణికుల నుండి పలు సూచనలు స్వీకరిస్తున్నారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం జరిగిన అమృత్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులు కొన్ని సూచనలు చేశారు. ఎస్కలేటర్స్ దగ్గర కచ్చితంగా సహాయకులను నియమించాలని, వారు లేకపోవడంతో సీనియర్ సిటిజన్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే స్లీపర్ క్లాస్ కోచ్‌లలో రైల్వేనే భోజనం ఏర్పాటు చేయడం మంచిదని పలువురు తెలిపారు. వీరికి సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. పవన్‌కుమార్ చిరు కానుకలు అందజేశారు.

సర్వీస్ రోడ్డుకు మోక్షం ఎప్పుడో..?

మరమ్మతులు చేయించని కూటమి పాలకులు, అధికారులు





పెదగదిలి నుంచి విమ్స్ మధ్యలో గోతులు పడి రాళ్లు తేలిన బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌లో సర్వీస్ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. గోతులుపడి రాళ్లు పైకి తేలుతుండడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విశాలంగా ఉన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా దీనికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించారు. ఆ రోడ్లు ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. ఈ రోడ్లకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పుడు మరమ్మతులు చేయిస్తారోనని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు. సుమారు ఏడాదిగా పెదగదిలి నుంచి విమ్స్ గేటు వరకు, హెల్త్ సిటీ నుంచి ముడసర్లోవ వరకు, సింహగిరి కాలనీ నుంచి విజయదుర్గా కాలనీ వరకు సర్వీస్ రోడ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. ఆయా రోడ్లపై తారు కరిగిపోవడంతో పిక్క, రాయి పైకి తేలిపోయింది. మరికొన్నిచోట్ల గోతులుపడ్డాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారులు బీఆర్‌టీఎస్ రోడ్డును పట్టించుకోకుండా వదిలేశారు. కనీసం మరమ్మతులు కూడా జరపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రోజూ వేలాది మంది వాహనచోదకులు తిరుగుతున్న ఈ రహదార్లు శిథిలావస్థకు చేరినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా రోడ్లు నిర్మించకపోయినా కనీసం సర్వీస్ రోడ్లకు వెంటనే మరమ్మతులైనా జరిపించాలని వాహనచోదకులు కోరుతున్నారు.